క్లుప్తంగా

ఘనంగా సూర్యారాధన



ఎంపీపీ జానకికి వేదాశీర్వచనం అందిస్తున్న అర్చకులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామ మందిరంలో మున్నంగి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూర్వక మహా సౌరయాగంలో 25వ రోజు ఆదివారం సూర్యారాధన ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ చేసి చండీహోమం నిర్వహించారు. ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వేదాశీర్వచనం అందించి సౌరయాగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సలాది ఊర్మిళా దేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఐ పోలవరం: మండల పరిధిలో విద్యుత్ లైను నిర్వహణ పనులు జరుగుతున్నందున సోమవారం ఐ పోలవరం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్, 11 కేవీ గుత్తెనదీవి ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు అమలాపురం విద్యుత్ ఏఈ రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా జి మూలపాలెం, ఎర్రగరువు, చిన్న కొడప గ్రామాలు, దుప్పులంక ఆక్వా చెరువులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆలయానికి విరాళం అందజేత

అమలాపురం టౌన్: స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లో గల శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి రంగులు వేసే నిమిత్తం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి రూ.10,116 విరాళంగా సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పచ్చిగోళ్ల సతీష్, త్సవటపల్లి రాంబాబు, అర్చకులు కొత్తలంక బ్రహ్మానంద సందీప్‌లకు దాత ఆదివారం ఆలయంలో అందజేశారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

ముమ్మిడివరం: మండలంలోని పది హేను రైతు సేవా కేంద్రాలలో గల రైతులంతా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను విధిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రశాంతకుమార్ సూచించారు. సీఎం కిసాన్ పథకం, పెట్టుబడి రాయితీ, పంటల బీమా తదితర పథకాల వర్తింపునకు రైతు విశిష్ట గుర్తింపు నమోదు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ నెంబరుకు అను సంధానించిన మొబైల్ ఫోన్ నెంబరు వివరాలను తీసుకువెళ్లి సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

వచ్చే నెల 2 నుంచి ఎమ్మెల్యేల నేపాల్ పర్యటన

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్, ఇద్దరు మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేల బృందం మార్చి 2 నుంచి నేపాల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ దేశంలో జరిగే పార్లమెంటరీ సమావేశాలలో పాల్గొననున్నారు. పలువురు ఎమ్మెల్యేలు పుదుచ్చేరి పర్యాటకాన్ని ప్రచారం చేసే కార్యక్రమంలో భాగంగా గోవా, న్యూఢిల్లీ, ఫ్రాన్స్, సింగపూర్ దేశాల్లో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లలో పాల్గొననున్నారు.

అక్రమ సస్పెన్షన్ రద్దు కోరుతూ ఆందోళన



అమలాపురం డిపోలో ధర్నా చేస్తున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ ఉద్యోగులు

అమలాపురం రూరల్: అమలాపురం డిపోలో డ్రైవర్ బీఎస్ నారాయణ అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి ఆదివారం నిరసన తెలిపారు. మధ్యాహ్నం గ్యారేజ్ గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. డ్రైవర్ బీఎస్ నారాయణ సస్పెన్షన్ ఎత్తివేయాలని, 1/19 సర్క్యులర్ కచ్చితంగా అమలు చేయాలని కోరారు. సోమవారం నుంచి సహాయ నిరాకరణ చేస్తామని విజయవాడ ఆర్టీసీ ఈడీ, కోనసీమ జిల్లా డీపీటీవోకు వినతి పత్రాలు అందించారు.

ఆసుపత్రి ఉద్యోగుల తొలగింపు అన్యాయం

ఐ పోలవరం: టి కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల పలువురు ఉద్యోగులను ప్రభుత్వం తొలగించడం పట్ల ఆదివారం ఐ పోలవరం మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. పందువారిపేటలో స్థానిక నాయకుడు పండు విజయ కుమార్ స్వగృహంలో ప్రత్యేక సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని, పార్టీ అధినాయకత్వం ఆదేశాలను అంతా పాటించాలని కోరారు. వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి తనిఖీలేనా..!

- హోటళ్ల నిర్వాహకులపై చర్యలకు అధికారుల మీనమేషాలు
- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతున్న వైనం
- 3 హోటళ్లపై కేసులతో పాటు 8 హోటళ్లకు నోటీసులు ఇచ్చిన తనిఖీ బృందం
- మల్లగుల్లాలు పడుతున్న మున్సిపాలిటీ



అధికారుల తనిఖీల్లో గుర్తించిన నిల్వ ఆహార పదార్థాలను మున్సిపల్ చెత్త వాహనంలో కంపోస్ట్ యార్డ్‌కు తరలిస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్: పట్టణంలోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 20న పట్టణంలోని పలు హోటళ్లపై ఆహార నియంత్రణ అధికారుల బృందం ఆకస్మిక దాడులు చేసినప్పుడు ఆయా హోటళ్లలో పలు లోపాలను గుర్తించిన సంగతి తెలిసిందే. అలా లోపాలు వెలుగు చూసిన మూడు హోటళ్లపై కేసులు నమోదు చేశారు. మరో 8 హోటళ్లకు నోటీసులు ఇచ్చారు. జరిమానాలు విధించారు. నూనెను పదే పదే మరిగిస్తూ వంటకాలు తయారు చేస్తున్న మూడు హోటళ్లను కొన్ని రోజుల పాటు మూసివేయాలని తనిఖీ బృందం స్పష్టం చేసింది. ఈ మూడు హోటళ్ల మూసివేత బాధ్యతను స్థానిక మున్సిపాలిటీకి ఆహార నియంత్రణ అధికారులు అప్పగించిన విషయమూ విదితమే.

సిఫార్సులతో వెనుకంజ

ఆహార నియంత్రణ అధికారుల బృందం హోటళ్లలో తనిఖీలు చేస్తున్నప్పుడే ఓ కూటమి నేత, ప్రజా ప్రతినిధి ఓ అధికారికి ఫోన్‌లో తనిఖీలు వద్దని చెప్పేందుకు ప్రయత్నించారు. అయితే ఆ అధికారి సంబంధిత ప్రజా ప్రతినిధి ఫోన్‌ను తీసుకోకుండా తమ పని తాము చేసుకుంటూ ముందుకు సాగిపోయారు. ఆ అధికారి ప్రజా ప్రతినిధి ఫోన్ తీసుకుని ఉంటే ఆయన సిఫార్సులు పాటించాల్సి వచ్చేది. పట్టణంలో ఇటీవల కాలంలో పలు హోటళ్లలో అపరిశుభ్రత, ఆహార పదార్థాల తయారీలో లోపాలపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆహార నియంత్రణ అధికారుల బృందం ఈ ఆకస్మిక దాడులు చేసింది.

కౌన్సిల్ సమావేశాలతో ఒరిగేదేమిటి?

గత రెండేళ్ల కాలం నుంచి జరుగుతున్న అనేక మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు మున్సిపాలిటీకి ఆహార కల్తీ నియంత్రణ అధికారి లేరని ఫలితంగా పట్టణంలోని పలు హోటళ్లలో ఆహార పదార్థాల్లో నాణ్యత, శుభ్రత కొరవడుతోందని పదే పదే ఏకరువు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇటీవల ఓ కౌన్సిల్ సమావేశంలో సాక్షాత్తూ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాణరావు ఆహార కల్తీ గురించి, పట్టించుకోని అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగానే ఉమ్మిడి జిల్లా ఆహార నియంత్రణ అధికారుల బృందం ఈ నెల 20న దాడులు చేసి తనిఖీలు నిర్వహించి లోపాలు గుర్తించింది. అయితే ఆ బృందం మున్సిపాలిటీకి చేసిన సూచనలు అమలుకు నోచుకోకపోవడం బాధాకరం.

అధికారుల సూచనలు బేఖాతరు

ఆహార అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాల ఆహార నియంత్రణ అధికారుల బృందం చేసిన పలు సూచనల అమలుకు స్థానిక మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపలేదు. కొందరు కూటమి నేతలు, ప్రజా ప్రతినిధులు మున్సిపల్ అధికారులను ప్రభావితం చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఆ మూడు హోటళ్ల తాత్కాలిక మూసివేతపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా హోటళ్ల నిర్వాహకులు అదురు బెదురూ లేకుండా తమ వ్యాపారాలు యథేచ్ఛగా నిర్వహించుకోవడం చూస్తుంటే రాజకీయ సిఫార్సులు ఎంత బలంగా పనిచేశాయో తేట తెల్లమవుతోంది.

రక్తపింజర హతం



గ్రామస్తుల చేతిలో హతమైన పాము

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు నూకలమ్మ సెంటర్ బస్టాండ్ వద్ద రక్త పింజర పాము హల్ చల్ చేసింది. మోసుగంటి సింహాద్రి ఇంటి ఆవరణలో పని చేస్తుండగా ఇటుకల మధ్య రక్త పింజర పాముని గుర్తించారు. గ్రామస్తుల సాయంతో పామును హతమార్చారు. పాము సుమారు ఐదడుగుల పొడవు ఉందని సింహాద్రి తెలిపారు.

2న ధ్యాన శిక్షణ

అమలాపురం టౌన్: క్రియా యోగ ధ్యాన తపోవన సేవాశ్రమం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన అమలాపురం శ్రీ సత్యసాయి కల్యాణ మండపంలో ఉచిత క్రియా యోగ ధ్యాన శిక్షణా తరగతులు జరుగుతాయని ఆ ట్రస్ట్ ప్రతినిధి కూర్మయ్యగారి భాస్కరరావు తెలిపారు. ఈ తరగతులకు హిమాలయ యోగి స్వామీ జ్ఞానానందగిరి మహరాజ్ పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ధ్యాన శిక్షణకు అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

సత్తెమ్మా.. మము చల్లంగ చూడమ్మా..

- వైభవంగా సత్తెమ్మ జాతర
- నేత్రానందంగా అమ్మవారి ఊరేగింపు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు





అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న జానపద నృత్యాలు, శక్తి వేషాలు

ముమ్మిడివరం: కోనసీమ ప్రజల ఆరాధ్య దేవతగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి జాతర ఆదివారం కన్నుల పండువగా జరిగింది. కోనసీమ నుంచే కాక ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు జాతర, తీర్థ మహోత్సవాలలో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రముఖులు, మేకల వంశీయులు అమ్మవారికి స్వయంపాకాలు సమర్పించి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి డప్పు డమరకాలు, మేళ తాళాలు, శక్తి వేషధారణలు, మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ గ్రామ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తీర్థ మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 30 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు భక్తులకు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తీర్థ మహోత్సవాల్లో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై జ్వాలాసాగర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.



దర్శనానికి బారులు తీరిన భక్తులు

ముగిసిన నైపుణ్యాభివృద్ధి సదస్సు



సదస్సు బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కనకయ్య తదితరులు

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు 'హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ యూజింగ్ ఏఐ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం' పై జరిగిన అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. సదస్సులో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీసీ రామారావు, సీ డ్యాక్ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ వీసీవీ రావు పాల్గొన్నారు. హెచ్‌పీసీ నిపుణులు ఆన్‌లైన్‌లో అధ్యాపకులు, పీజీ విద్యార్థులకు హెచ్‌పీసీ అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్ గురించి వివరించారు. ప్రముఖ విద్యావేత్తలు, ఐటీ నిపుణులు, విదేశీ ఐటీ నిపుణులు సభ్యులకు అవగాహన కల్పించారు. దేశంలోని వివిధ యూనివర్సిటీ అధ్యాపకులు, ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా వారి వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్ కోఆర్డినేటర్‌గా, డాక్టర్ అనురాగ్ కో కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. అధ్యాపకులు విజయ కుమారి, అడబాల కుమార్, శివరామ కృష్ణ, సుష్మ, శాంతి, జీటీ నాయుడు, తిలక్, డాక్టర్ టీవీ జనార్ధనరావు, వివిధ విభాగాధిపతులు, ఏవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన సబ్‌స్టేషన్‌కు పీటీఆర్ మంజూరు

సాక్షి ఇంపాక్ట్



కాట్రేనికోన సబ్‌స్టేషన్‌లో నూతనంగా అమర్చిన పీటీఆర్ వద్ద అధికారులు

కాట్రేనికోన: కాట్రేనికోన సబ్‌స్టేషన్‌లో శనివారం 8 మెగావాట్ల పీటీఆర్(పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను అమర్చడంతో మండల ప్రజలకు వేసవి ఉక్కపోత నుంచి ఊరట కలిగింది. విద్యుత్ కోతలు, మండల ప్రజల ఇబ్బందులపై గత నెల 3న సాక్షి దిన పత్రికలో 'విద్యుత్ వినియోగదారుల వెతలు' శీర్షికతో వెలువడిన కథనంపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. కాట్రేనికోన సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ఉన్నతాధికారులు 8 మెగావాట్ల పీటీఆర్‌ను మంజూరు చేశారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు ఆక్వాపై ప్రేమ చూపించడంతో ఈ పీటీఆర్ చెయ్యేరు సబ్‌స్టేషన్‌కు తరలిపోయింది. దీంతో ఉన్నతాధికారుల తీరుపై సాక్షి దినపత్రికలో ఈ నెల 3న 'ఆశలు ఆవిరి' అనే శీర్షికన మరో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు కొత్తగా ఎనిమిది మెగావాట్ల పీటీఆర్‌ను వేస్తామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. కాట్రేనికోన సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ వేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అఖిల భారత మాలల సంఘ అధ్యక్షునిగా తిరుపతిరావు

ఉప్పలగుప్తం: అఖిల భారత మాలల సంఘ జిల్లా అధ్యక్షునిగా మండలంలోని ఎస్.యానం గ్రామానికి చెందిన రేవు తిరుపతిరావు నియామితులయ్యారు. అఖిల భారత మాలల సంఘాల చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన సమావేశంలో తన నియామకాన్ని శనివారం ప్రకటించినట్టు తిరుపతిరావు ఆదివారం తెలిపారు.

ముగిసిన శ్రీదేవి అమ్మవారి జన్మదిన మహోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో వేంచేసి యున్న శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారి జన్మదిన వార్షికోత్సవ మహా సంప్రోక్షణ, రాజ శ్యామల మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత అయిదు రోజులుగా అమ్మవారి ఆలయం వద్ద పలు రకాల హోమాలు, అభిషేకాలు జరగుతున్న సంగతి తెలిసిందే. చివరి రోజు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, సూర్య మహాసౌర అరుణ హోమం జరిగాయి. రాత్రి 8 గంటలకు జరిగిన మహా పూర్ణాహుతితో మహోత్సవాలు ముగిశాయని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించే అన్న సమారాధనకు భక్తులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

గో కల్యాణం.. చూచిన కనులదే భాగ్యం..



భట్టుపాలెంలో ఆవులకు కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి భట్టుపాలెంలో రైతు కోళ్లపల్లి ఈశ్వర భగవాన్ నివాసంలో గో కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోళ్లపల్లి భగవాన్‌కు చెందిన ఒంగోలు గిత్తకు, వారి ఇంట మరో ఆవుకు పుట్టిన మేనకోడలు ఆవుతో శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ వివాహం జరిపించారు. ఈ వివాహాన్ని చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా రైతు భగవాన్ మాట్లాడుతూ హిందూ ధర్మం ప్రకారం ఆబోతును వేంకటేశ్వర స్వామి స్వరూపంగా, ఆవును మహాలక్ష్మి స్వరూపంగా భావిస్తామని ఈ కల్యాణం చేయటంతో దేవతా కల్యాణం చేసినట్టుగా సంతృప్తి చెందామని వివరించారు.

పంపుహౌస్ పనుల పరిశీలన



గోపాల్‌నగర్ వద్ద పైపులైను పనులు పరిశీలిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించే కీలకమైన అరటికాయలంక పంపు హౌస్ వద్ద జరుగుతున్న పనులను ఆదివారం ఆర్‌ఏఓ మునిస్వామి పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, నాణ్యతను పాటించాలని ఆదేశించారు. అనంతరం గోపాల్ నగర్ వద్ద జరుగుతున్న తాగునీటి పైపులైను పనులు సైతం పరిశీలించారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో వేట కథలకు ప్రత్యేక గుర్తింపు

సాహిత్య అకాడమీ సలహా సంఘ కన్వీనర్ మృణాళిని



మాట్లాడుతున్న సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు శ్రీనివాసరావు

యానాం: తెలుగు కథా సాహిత్యంలో వేట కథలు ప్రత్యేకమైనవని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘ కన్వీనర్ మృణాళిని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సర్వశిక్షా అభియాన్ సమావేశ మందిరంలో కేంద్ర సాహిత్య అకాడమీ, యానాం స్ఫూర్తి సాహితీ సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో వేట కథలపై ప్రత్యేక సదస్సు జరిగింది. సదస్సుకు అధ్యక్షత వహించిన మృణాళిని మాట్లాడుతూ మనిషికి, జంతువులకు అనుబంధం, మనిషికి, మనిషికి మధ్య సంబంధాలను వేటకథలు విశ్లేషిస్తాయని అన్నారు. గౌరవ అతిథి, స్ఫూర్తి సాహితీ సమాఖ్య అధ్యక్షుడు, కథకుడు దాట్ల దేవదానం రాజు మాట్లాడుతూ ప్రత్యేకంగా వేటకథల సదస్సు నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రముఖ సాహితీవేత్త వాసిరెడ్డి నవీన్, అల్లం శేషగిరిరావు కథలపై మాట్లాడారు. ఆర్‌ఏఓ మునిస్వామి సాహితీవేత్తలను అభినందించారు.

కాశీ మృతి క్రీడా రంగానికి తీరని లోటు

- నివాళులర్పించిన జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్
- త్వరలో కాశీ మెమోరియల్ బాడీ బిల్డింగ్ పోటీలు



కాశీ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు



కాశీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ దివంగత రంకిరెడ్డి కాశీ విశ్వనాథం పేరిట త్వరలో మెమోరియల్ బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రకటించింది. అమలాపురంలోని హెల్త్ ఫిట్నెస్ జిమ్‌లో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కాశీ సంతాప సభ ఆదివారం ఉదయం జరిగింది. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో కాశీ ఈ ప్రాంతానికి అందించిన క్రీడా స్ఫూర్తిని క్రీడాకారులు తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కాశీ మరణం క్రీడా లోకానికి తీరని లోటని అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు సంబంధించి క్రీడా రంగానికి కాశీ ఓ పెద్ద దిక్కుగా వ్యవహరించారని పేర్కొన్నారు. అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌ను షటిల్ బ్యాడ్మింటన్ హబ్‌గా మలిచి ఎంతో మంది క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ఈ షటిల్ కోర్టు నుంచి తన తనయుడు సాయి రాజ్ సాత్విక్‌కు శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ క్రీడాకారుడిగా తయారు చేశారని గుర్తు చేశారు. జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరావు, జిల్లా క్రీడా భారతి కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబుతో పాటు బాడీ బిల్డర్లు, పవర్ లిఫ్టర్లు కాశీ చిత్ర పటానికి నివాళులర్పించారు.

క్రీడాకారులు కాశీని ఆదర్శంగా తీసుకోవాలి

నేటి క్రీడాకారులు జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ దివంగత రంకిరెడ్డి కాశీ విశ్వనాథాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అన్నారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధి అయిన కాశీ అటు వాకర్స్ క్లబ్‌కు, ఇటు క్రీడాకారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చేవారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం ఉదయం జరిగిన కాశీ సంతాప సభలో సత్య వర ప్రసాద్ మాట్లాడారు. తొలుత కాశీ చిత్రపటానికి వాకర్స్ ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివ రామకృష్ణ, వాకర్స్ ప్రతినిధులు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, నూకల సత్యనారాయణ, వలవల వెంకట రెడ్డినాయుడు, ఉప్పగంటి భాస్కరావు, కుడుపూడి త్రినాథ్, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు నివాళులు అర్పించారు.

కాపునాడు నాయకుల నివాళి

జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ రంకిరెడ్డి కాశీ విశ్వనాథానికి యువ కాపునాడు నాయకులు నివాళులర్పించారు. కాశీ మృతి పట్ల ఆ నాయకులు విచారం వ్యక్తం చేశారు. కిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రి చైర్మన్ చైతన్యరాజు తల్లి లక్ష్మీకాంతం మృతి పట్ల సైతం వారు సంతాపం వ్యక్తం చేశారు. జాతీయ యువ కాపునాడు ప్రచార కార్యదర్శి గారపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి నిమ్మకాయల సురేష్, నియోజకవర్గ అధ్యక్షుడు కొప్పుల భాస్కరరావు, పట్టణ అధ్యక్షుడు అరిగెల తేజ వెంకటేష్‌లు వారి మృతి పట్ల సంతాపం తెలిపారు.

ఎస్సీ యువతపై వేధింపులు ఆపాలి

అమలాపురం రూరల్: ఎస్సీ యువకులు, వారి కుటుంబ సభ్యులపై పోలీసుల వేధింపులు ఆపాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంబేడ్కర్ కోనసీమ జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు హెచ్చరించారు. అమలాపురం మండలం ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రాత్రి దళిత సంఘాల జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. కొందరు దళిత యువకులపై ఉద్దేశ్య పూర్వకంగా అమలాపురంలో తప్పుడు ఫిర్యాదులు చేసిన కారణంగా పోలీసులు వేధిస్తున్నారని దళిత నాయకులు బొంతు రమణ, రేవు తిరుపతిరావు, నక్కా సంపత్, శెట్టిబత్తుల తులసీరావు, గెల్ల రాజేంద్ర, గిడ్ల శ్యామ్, పెయ్యల ప్రతాప్, అయితాబత్తుల పండు, ముత్తాబత్తుల శ్రీను తదితరులు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

అమలాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా గుర్తెరగాలని పేరూరు సర్పంచ్ దాసరి అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం పేరూరు గ్రామంలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

రావులపాలెం: మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి వివిధ దైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ ఆదివారం తెలిపారు. స్థానిక బస్టాండ్ నుంచి 24, 25 తేదీల్లో విజయవాడ- శ్రీశైలం, 26న మహాశివరాత్రి రోజున ద్రాక్షారామ, అంగర-కోటిపల్లి, సామర్లకోట, పిఠాపురం, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. అలాగే భక్తులు కోరుకున్న శైవ క్షేత్రాలకు ప్రత్యేకంగా బస్సులు నడుపుతామన్నారు. మరిన్ని వివరాలకు బస్‌స్టేషన్ ఎంక్వైరీ 99592 25549, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871, డిపో మేనేజర్ 99592 25537 నంబర్లకు సంప్రదించాలన్నారు.